క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు

హుజూరాబాద్‌రూరల్: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం పరిష్కరించేలా కృషి చేస్తానని టీపీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు గాలిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని చెల్పూర్ గ్రామంలో టీపీఆర్టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఉపాధ్యాయ నాయకుడు ఆరె రాకేశ్‌రెడ్డి ఇంటిఆవరణలో సమావేశం నిర్వహించారు. భూపాలపల్లి జిల్లాలో పనిచేస్తున్న స్థానిక ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆయనను కలిసి సమస్యలను విన్నవించాలంటూ వినతిపత్రం సమర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉపాధ్యాయుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. అనంతరం పలువురు కాంగ్రెస్ నాయకులు హర్షవర్ధన్ రెడ్డిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పర్వత సత్యనారాయణ, అధ్యక్షుడు గార్లపాటి ఉమాకర్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు మంచిరెడ్డి అనంతరెడ్డి, చెల్పూర్ గ్రామంలోని ఉపాధ్యాయులు, భూపాలపల్లి జిల్లాలోని వివిధ మండలాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నాయకుల నిరసన



రామడుగు: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్‌ను ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ మరొకరి పేరు ప్రకటించడం పట్ల మండల కేంద్రంలో గురువారం మాల సంఘం నాయకులు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కాడె శంకర్, నాయకులు జవ్వాజీ అజయ్, గునుకొండ అశోక్, జక్కుల బాబు, క్రిస్టఫర్, హన్మంతు, తిరుపతి, మధుసూదన శివ, శ్రావణ్ పలువురు పాల్గొన్నారు.

కష్టపడితేనే గుర్తింపు

జమ్మికుంట: కష్టపడి పనిచేస్తేనే కాంగ్రెస్ పార్టీ ప్రతి ఒక్కరిని గుర్తిస్తుందని, కలిసికట్టుగా పని చేయాలని హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. గురువారం మండలంలోని వెంకటేశ్వరపల్లి గ్రామంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం పని చేయాలన్నారు. బూత్ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు సదానందం, సీనియర్ నాయకులు అరుకాల వీరేశలింగం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గూడెపు సారంగపాణి, నాయకులు మొలుగూరి సదయ్య, రాచపల్లి రమేశ్, పింగి రాకేశ్, వీరమనేని పరశురాంరావు, పర్లపల్లి నాగరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: పార్టీలో పైరవీలు పనిచేయవని వొడితెల ప్రణవ్ అన్నారు. మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటాలని, గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఇంగిలే రామారావు, మహిళా అధ్యక్షురాలు కొడెం రజిత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గూడెపు సారంగపాణి, జిల్లా మత్స్యశాఖ అధ్యక్షుడు బండి మల్లేశ్, పెద్ది కుమార్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బల్మూరిని కలిసిన నాయకులు

జమ్మికుంట: ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న సందర్భంగా హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు వెంకన్న, మండల అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు గురువారం వెంకట్‌ను కలిశారు. శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలి పారు. కార్యక్రమంలో మైనార్టీ, ఓబీసీ సెల్ నాయకులు సలీంపాషా, నాగేంద్ర, శ్రీనివాస్, మాధవరావు, లింగారావు, శ్రీనివాస్‌లున్నారు. ఎమ్మెల్సీగా నామినేషన్ వేయనున్న బల్మూరి వెంకట్, మహేశ్‌కుమార్‌గౌడ్‌ను జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి మర్యాదగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

'కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేదెవరో చెప్పాలి'

చిగురుమామిడి: రాష్ట్రంలో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం పార్లమెంట్ ఎన్నికల తర్వాత కూలిపోతుందని ఆరోపణలు చేసిన కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ కూల్చేదెవరో చెప్పాలని కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దాసరి ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం చిగురుమామిడిలో మాట్లాడారు. బండి సంజయ్ ఏ ఉద్దేశంతో వ్యాఖ్యలు చేశారో దానివెనుక ఉన్న ఆధారాలు, కుట్రలు బట్టబయలు చేయాలన్నారు. విషయం ఎలా తెలిసిందో చెప్పాలని, ప్రభుత్వాన్ని కూల్చే కుట్రకోణంలో ఎంపీకి భాగస్వామ్యం ఉందా అనే విషయంలో పోలీసులు విచారణ జరపాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల తీర్పును అవమానించేలా వ్యాఖ్యలు చేయడం సబబుకాదన్నారు.

బిల్లులు రాలే.. నిర్మాణాలు కాలే..

- రైతు కల్లాల పరిస్థితి కంచికేనా..?
- నిర్మించినా అందని బిల్లులు
- మండలానికి 206 కల్లాలు మంజూరు
- 25 నిర్మాణం పూర్తి, వివిధ దశల్లో మరికొన్ని
- కొత్త ప్రభుత్వంలోనైనా బిల్లులచ్చేనా?



వెదిరలో నిర్మాణం పూర్తయిన కల్లం

రామడుగు: రైతులు పండించిన పంటను ఆరబోసుకోవడానికి అవసరమైన కల్లం నిర్మించుకోవడానికి గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ అధికారులు వాటి నిర్మాణంపై రైతులను చైతన్యపర్చడంలో విఫలమయ్యారు. దీంతో రైతులు కల్లాల నిర్మాణంపై ఆసక్తి చూపలేదు. మండలంలో కొందరు రైతులు కష్టపడి కల్లం నిర్మించుకున్నప్పటికీ బిల్లులు సకాలంలో రాలేదు. దీంతో మరికొందరు రైతులు వీటిపై శ్రద్ధ చూపలేదు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా నిర్మాణాలు మాత్రం నత్తనడక సాగాయి. మండలంలోని 23 గ్రామాలలోని రైతులు పంట పొలాల వద్ద కల్లాలను నిర్మించుకోవడానికి ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా రూ.1.70 కోట్లు మంజూరు చేసింది. మండలంలోని 206 మంది రైతులు కల్లాలు నిర్మించుకోవడానికి అనుమతి వచ్చింది. కానీ ఇప్పటివరకు కేవలం 25 మాత్రమే పూర్తయ్యాయి. మరో డెబ్బై వరకు కల్లాల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. దాదాపుగా వంద కల్లాల నిర్మాణ పనులు నేటికి ప్రారంభానికి నోచుకోలేని దుస్థితి నెలకొంది. మూడు రకాల కల్లాల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. రూ. 54 వేలతో 50 మీటర్ల కొలతలు కలిగిన నిర్మాణం, రూ. 68 వేలతో 60 మీటర్ల కొలతలు, రూ.75 వేలతో 75 మీటర్లతో నిర్మాణానికి నిధులు కేటాయించింది. కొందరు రైతులు కల్లాలు నిర్మించుకున్నప్పటికీ బిల్లు రావడం ఆలస్యమైంది. దీంతో మిగతావారు నిర్మాణాల పట్ల ఆసక్తి చూపలేదు. అధికారులు కల్లాల నిర్మాణం చేసుకోవాలని క్షేత్రస్థాయిలో ప్రచారం చేయకపోవడంతో నిర్మాణాలు ఆశించిన స్థాయిలో జరగలేదు. మరికొందరు రైతులు నేటికి బిల్లులు రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో కష్టపడి నిర్మాణం పూర్తి చేశాం, అధికారులు బిల్లులు చెల్లించాలని కోరుతున్నారు. గత ప్రభుత్వంలో నిర్మాణాలు జరిగినప్పటికీ బిల్లులు రాని పరిస్థితి ఏర్పడింది. కానీ నూతన కాంగ్రెస్ ప్రస్తుతం నిర్మించుకున్నవారికి బిల్లులతో పాటు మిగతా కల్లాల నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని రైతులు ఆశపడుతున్నారు.

రూపాయి రాలేదు..



గత ప్రభుత్వ ఆదేశాలతో ఏడాది క్రితం కల్లం నిర్మించాను. దాదాపు రూ.70 వేల వరకు ఖర్చు చేశాను. కల్లాల నిధుల నుంచి ఒక్క రూపాయి కూడా ఇప్పటి వరకు రాలేదు. ఈ ప్రభుత్వమైనా రైతులకు బిల్లులు చెల్లించడంతో పాటు మిగతావి పూర్తయ్యేలా ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నాను.

– శనిగరపు అంజన్‌కుమార్, రైతు, వెదిర

సకాలంలో ఎరువులు అందించడమే లక్ష్యం

కరీంనగర్ డీఏవో శ్రీధర్



తనిఖీ చేస్తున్న డీఏవో శ్రీధర్

జమ్మికుంట: రైతులకు సకాలంలో ఎరువులు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని కరీంనగర్ డీఏవో శ్రీధర్ అన్నారు. గురువారం పట్టణం, మండలంలోని ఫర్టిలైజర్ షాపుల్లో ఏవో గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా తనిఖీ నిర్వహించారు. షాపు యాజమానులు ఎరువులను పక్కదారి పట్టించకుండా సబ్సిడీ ఎరువుల ఆన్‌లైన్, క్రయవిక్రయాల వివరాలు పర్యవేక్షించామన్నారు. ఫర్టిలైజర్ మానిటరింగ్ వెరిఫికేషన్ సిస్టంతో ఎరువుల కొరత, సప్లై, నిల్వ వివరాలు అందుబాటులో ఉంటాయన్నారు. తద్వారా రైతులకు ఎరువులు అందించడం సులభమవుతుందన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంటల పరిశీలన



వరిపొలం పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి, కొక్కెరకుంట గ్రామాలలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం కరీంనగర్ ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు గురువారం క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిలో మొగిపురుగు, సల్ఫైడ్ దుష్ప్రభావం ఉందని, మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణ కోసం రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు విజయభాస్కర్, ఉషారాణి, మధుకర్‌రావు, మదన్ మోహన్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి సంజీవరెడ్డి, రమేష్, సర్పంచ్ అభిషేక్‌రెడ్డిలు పాల్గొన్నారు.

భ్రూణ హత్యలు నేరం

తిమ్మాపూర్: భ్రూణ హత్యలు నేరమని, లింగనిర్ధారణ చట్ట వ్యతిరేకమని తిమ్మాపూర్ ఎంపీపీ కేతిరెడ్డి వనిత అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల బాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ కమిటీల ద్వారా పిల్లల సమస్యలు పరిష్కరించాలన్నారు. భ్రూణ హత్యల నివారణకు ఆర్ఎంపీలకు అవగాహన కల్పించాలని సూచించారు. బాల్య వివాహాలు చేయొద్దని,14 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకోవద్దన్నారు. 31 వరకు ఆపరేషన్ స్మైల్ టీం తనిఖీ చేస్తుందన్నారు. లైంగిక వేధింపుల నివారణకు స్నేహిత అనే ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందరూ అందులో పాల్గొని అవగాహన కల్పించాలన్నారు. పిల్లలకు ఏదైనా ఆపద ఉంటే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ఉచిత నెంబర్‌కు ఫోన్ చేయాల్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీవాణి, సీడీపీఓ సబితా, ఎంపీడీఓ రవీందర్ రెడ్డి, తహసీల్దార్ కనుకయ్య, ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్ ప్రణవ్, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా కో ఆర్డినేటర్ సంపత్, ఎల్‌సీపీఓ రాజు, లేబర్ ఆఫీసర్ చక్రధర్ రెడ్డి, ఏఎస్ఐ, సూపర్ వైజర్లు శ్రీలత ,పద్మ అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు

కేంద్రప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఇల్లందకుంట: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకే వికసిత్ భారత్ సంకల్ప్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు ఈటల రాజేందర్ అన్నారు. గురువారం మండలంలోని లక్ష్మాజిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు.కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆరెల్లి జ్యోస్న, జమ్మికుంట జెడ్పీటీసీ శ్రీరాంశ్యామ్, నాయకులు కంకణాల సురేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్, కాలేజీ బస్సుల ఫిట్‌నెస్ తనిఖీ చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హుజూరాబాద్: హుజూరాబాద్ నియోజకవర్గంలోని ప్రైవేటు పాఠశాల, కళాశాలల బస్సుల ఫిట్‌నెస్ తనిఖీ చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో గురువారం మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఠాకూర్ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేశ్ మాట్లాడుతూ...బస్సుల ఫిట్‌నెస్, డ్రైవర్ల లైసెన్స్‌లను తనిఖీ చేయాలని కోరారు. ఫిట్‌నెస్ లేని బస్సులను గుర్తించి సీజ్ చేసి యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము యాదవ్, మండల అధ్యక్షుడు వేణు గోపాల్, నాయకులు బొద్దుల కృష్ణ, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

డీ 89 ఉపకాలువకు గండి



గండిని పరిశీలిస్తున్న ఎంపీపీ చిలుక రవీందర్

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ శివారులోని డీ 89 ఉపకాలువకు గండి పడింది. దీంతో రోడ్డు కోతకు గురైంది. విషయం తెలుసుకున్న ఎంపీపీ చిలుక రవీందర్ ఎస్సారెస్పీ అధికారులకు సమాచారం అందించి నీటిని నిలిపివేయించారు. అనంతరం గండిని పరిశీలించి కాలువ కింది రైతులకు నీటి కొరత రాకుండా గండికి మరమ్మతు చేయాలని అధికారులకు సూచించారు. వెంట ఏఈ మౌనిక, ఏఈవో ప్రసన్నకుమార్, కొమురయ్య పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



హుజూరాబాద్: రాష్ట్ర విభజన హామీలను కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలనే డిమాండ్‌తో తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో 21న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను గురువారం సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్కెర రాజు ఆవిష్కరించారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వివక్ష చూపుతుందన్నారు. సదస్సుకు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. హామీల అమలు కోసం అన్ని వర్గాల ప్రజలు ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శివదయాల్ సింగ్, బత్తుల తిరుపతి, గిర్నాల కుమారస్వామి, గోపగోని సాయిరాం, బి.వీరు, బి.అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ అమ్మకాలు అరికట్టాలి

హుజూరాబాద్: హుజూరాబాద్‌లో ప్లాస్టిక్ అమ్మకాలు అరికట్టాలని పర్యావరణ పరిరక్షణ కమిటీ నాయకుడు వేల్పుల ప్రభాకర్, తునికి సమ్మయ్య, మోర సతీశ్, ఐలయ్య డిమాండ్ చేశారు. నిషేధిత ప్లాస్టిక్ అమ్మకాల గూర్చి మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని, ప్లాస్టిక్‌తో పర్యావరణానికి నష్టం జరుగుతుందని విజ్ఞప్తి చేసినా పెడచెవిన పెడుతున్నారని, ఇప్పటికైనా కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్, మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

కంప్యూటర్ ల్యాబ్‌లు మంజూరు

మానకొండూర్: మండలంలోని పోచంపల్లి మోడల్ స్కూల్, గట్టుదుద్దెనపల్లి ఉన్నత పాఠశాలలకు కంప్యూటర్ ల్యాబ్‌లు మంజూరయ్యా యని మండల విద్యాధికారి మధుసూదనాచారి గురువారం తెలిపారు. విద్యార్థులు సాంకేతికరంగంలో రాణించే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్ ల్యాబ్‌లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. మోడల్ స్కూల్లో పది కంప్యూటర్లు, ఉన్నత పాఠశాలలో ఐదు కంప్యూటర్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

వీణవంక: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టీపీసీసీ సభ్యుడు కర్ర భగవాన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం మాట్లాడారు. గత ప్రభుత్వం రైతుల సమస్యలను విస్మరించిందని, రుణమాఫీ అమలు చేయక కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లుతుందని మండిపడ్డారు. రానున్న రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ఇందిరమ్మ రాజ్యం రానుందని అన్నారు. సర్పంచ్‌ల సమస్యలు పరిష్కరిస్తామని బీఆర్ఎస్ నాయకులు చెప్పడం విడ్డూరంగా ఉందని, వారి సమస్యలను విస్మరించేందే బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆరోపించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ గల్లంతు ఖాయమని పేర్కొన్నారు.

కరీంనగర్ - తిరుపతి రైలు రోజూ నడపాలి

హుజూరాబాద్‌రూరల్: భక్తుల రద్దీ దృష్ట్యా కరీంనగర్ నుంచి తిరుపతికి రోజూ రైలు నడపాలని జర్నలిజం అధ్యాపకుడు లింగబత్తిని మల్లేశం గురువారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఓ ప్రకటనలో కోరారు. వారానికి రెండుసార్లు నడిపించడం వల్ల భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.

నాటుసారా పట్టివేత

ఇల్లందకుంట: మండలంలోని సిరిసేడు గ్రామంలో కరీంనగర్ జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్, సీఐ కె.నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహించి 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని 375 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్సై శ్రీనివాస్, హెచ్‌సీ మోసిన్, ఈసీలు కుమార్, యాదవ్, శాసింబి, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గంగాధర: మండలంలోని మధురానగర్ చౌరస్తాలో ఉన్న సురభి శాంతినికేతన్ హైస్కూల్ 2008–09 పదో తరగతి విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చదువుకున్న రోజుల నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం విద్యాబోధన చేసిన గురువులను ఘనంగా సన్మానించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చిప్ప వీరేశం, వీరనర్సయ్య, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాచారం

20న న్యాయ విజ్ఞాన సదస్సు

రామడుగు: మండలంలోని గుండి అక్షర పాఠశాల మైదానంలో 20న న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నామని న్యాయవాది ప్రశాంత్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కరీంనగర్ న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కె. వెంకటేశ్ హాజరవుతారని అవకాశాన్ని ప్రజలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

హుజూరాబాద్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని దమ్మక్కపేట రోడ్డులో ఉన్న మైనార్టీ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు ఆసక్తి గల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కామిశెట్టి కుమారస్వామి గురువారం ప్రకటనలో తెలిపారు. 18 నుంచి ఫిబ్రవరి 6వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, వివవరాలకు 73311708502,76360354533, 9985132858 నంబర్లు సంప్రదించాలన్నారు.

తిమ్మాపూర్: మైనారిటీ గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మానకొండూర్ మైనారిటీ గురుకుల ప్రిన్సిపాల్ పిడిశెట్టి సంపత్ ప్రకటనలో పేర్కొన్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి తిమ్మాపూర్‌లోని తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సీఈసీ, హెచ్ ఈసీలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 6లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి గలవారు ఆన్‌లైన్‌లో లేదా తిమ్మాపూర్‌లోని రవాణా శాఖ కార్యాలయం సమీపంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో ఫొటో, ఆధార్ కార్డు సమర్పించాలని కోరారు. వివరాలకు 7995057932, 8639344647 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

తిమ్మాపూర్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అల్గునూర్ సీవోఈ ప్రిన్సిపాల్ దేవేందర్ తెలిపారు. దరఖాస్తు గడువు ఈనెల 20 వరక పొడిగించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని 38 సీవోఈలలో ప్రవేశానికి ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

గంగాధర: మండలంలోని బూరుగుపల్లి నుంచి గంగాధర వరకు విద్యుత్ లైన్‌ల వెంట చెట్ల కొమ్మలు తొలగించే కార్యక్రమం ఉన్నందున ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ సత్యనారాయణ తెలిపారు. మండలంలోని రాళ్లపల్లి, నర్సింహులపల్లి, బూరుగుపల్లితో పాటు గుండి, చిట్యాలపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముగిసిన వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల్లో మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే

గంగాధర: మండలంలోని కోట్ల నర్సింహులపల్లి గ్రామంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న నందగిరి వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు ఉదయం అగ్నిగుండాలు, ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీవీరభద్రస్వామికి అన్నపూజ, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ బ్రహ్మోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వార్షికోత్సవాల్లో అన్నదానంతో పాటు నిత్యం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో సర్పంచు కవిత, పూజారి పారండ్ల శ్రీనివాస్, శంకరయ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో ఇబ్బంది కలగలేదు

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



సన్మానిస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

వీణవంక: కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచే రైతులకు కష్టాలు మొదలయ్యాయని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రైతులకు ఎకరాకు రూ.15వేలు ఇస్తామని చెప్పి ఇంతవరకు చిల్లిగవ్వ ఇవ్వలేదని మండిపడ్డారు. మండల కేంద్రంలో గురువారం మాట్లాడారు. ఎస్సారెస్పీ ద్వారా చివరి ఆయకట్టుకు నీరు అందించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నెల రోజులకే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. దళితబంధు రెండో విడుత డబ్బులు వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నీల కుమారస్వామి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ముసిపట్ల తిరుపతిరెడ్డి, తాళ్లపల్లి మహేశ్, రాయిశెట్టి శ్రీనివాస్, రాజమల్లయ్య, తదితరులు ఉన్నారు. మండలంలోని ఓ పాత్రికేయుడిగా పత్తి కొండాల్‌రెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురికాగా ఎమ్మెల్యే ఆయన ఇంటికెళ్లి పరామర్శించారు. తన వంతు సాయం అందిస్తామని ప్రకటించారు.

చివరి ఆయకట్టుకు సాగునీరందించాలి

హుజూరాబాద్: మార్పు అంటే రైతులు, ప్రజలను ఇబ్బంది పెట్టడమేనా అని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురువారం పట్టణంలోని సిటీ సెంట్రల్ హాల్‌లో నియోజకవర్గంలోని 93 మంది సర్పంచ్‌లను సన్మానించారు. నియోజకవర్గ రైతాంగానికి వెంటనే సాగునీరు అందించాలన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలపైన దాడులకు పాల్పడితే సహించమని హెచ్చరించారు. నియోజకవర్గంలోని సర్పంచ్‌లకు అండగా ఉంటానన్నారు. రాబోయే ప్రతి ఎన్నికల్లో హుజూరాబాద్ గడ్డపై బీఆర్ఎస్ జెండా ఎగిరేలా పని చేయాలన్నారు. ప్రజా సమస్యలపై పోరాడాలని, ప్రజావ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజల మధ్యలో ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో హోంగార్డుకు గాయాలు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని శాలపల్లి-ఇందిరానగర్ గ్రామంలో గురువారం రాత్రి హుజూరాబాద్-జమ్మికుంట ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో హోంగార్డుకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ కార్యాలయంలో హోంగార్డుగా చేస్తున్న సంపత్ విధులు ముగించుకొని బైక్‌పై ఇంటికి వెళ్తున్న క్రమంలో శాలపల్లి-ఇందిరానగర్ గ్రామం వద్ద జమ్మికుంట-హుజూరాబాద్ ప్రధాన రహదారి మధ్యలోని డివైడర్‌ను ఢీ కొన్నాడు. ప్రమాదంలో సంపత్ తలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన కోమటి రంజిత్‌కుమార్(24) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా పద్మశాలీ సంఘం నాయకులు గురువారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. క్వింటాల్ బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్ చిలకమారి శ్రీనివాస్, బండారి సదానందం, సబ్బని రాజేందర్, లక్కీ సెలక్షన్ అశోక్, టీఆర్పీఎస్ మండలాధ్యక్షుడు సంఘం సత్యనారాయణ, టౌన్ కన్వీనర్ చంద్రశేఖర్, సాయి, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన ఆదర్శ పురుషుల పొదుపు సంఘం సభ్యులు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఈసందర్భంగా ఇరువురు కుటుంబ సభ్యులకు గురువారం ఆర్థికసాయం అందించారు. బుర్ర లింగయ్య కుటుంబానికి రూ.71,516 సంఘం అధ్యక్షుడు, సైదాపూర్ సమితి అధ్యక్షుడు తాడ వాసుదేవరెడ్డి అందించారు. పుట్టల సమ్మయ్య కుటుంబ సభ్యులకు రూ.78,923 వాసుదేవరెడ్డి అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం గణకుడు గురువయ్య, సంఘం సభ్యులు వేణు, ఉపాధ్యక్షుడు మామిడి శ్రీనివాస్, దరిపెల్లి రమేశ్, రవి, పలువురు ఉన్నారు.

చొప్పదండి: దుబాయ్‌లో గుండెపోటుతో మృతిచెందిన స్నేహితుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు మిత్రులు రూ.60 వేల విరాళం సేకరించి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ద్వారా గురువారం అందించినట్లు కాంగ్రెస్ నాయకులు సంబోజి సునీల్ తెలిపారు. మల్యాల మండలం మానాల గ్రామానికి చెందిన తారాల రాజ్‌కుమార్ ఉపాధి కోసం దుబాయి వెళ్లి గుండెపోటుతో మృతి చెందాడు. మేడిపల్లి గురుకుల పాఠశాలలో చదువుకున్న మిత్రులు నగదు జమచేసి రాజ్‌కుమార్ కూతుళ్ల పేరు మీద పోస్టాఫీస్‌లో జమ చేశారని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు కుటుంబానికి అందేలా చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు.

పరామర్శ

ఇల్లందకుంట: మండలంలోని బూజునూరు గ్రామంలో ఇటీవల మృతిచెందిన వారి కుటుంబ సభ్యులను ఎంపీపీ సరిగొమ్ముల పావని వెంకటేశ్ గురువారం పరామర్శించారు. అనంతరం ఆర్థిక సాయం, బియ్యం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బూసవెన మల్లయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ ఎగ్గటి జగన్, చంద్రయ్య, కిరణ్, పూర్ణ శ్యామ్‌సుందర్, ఐలయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.